ప్రజాశక్తి

శుక్రవారం 15 డిసెంబర్ 2023 5

శ్రీ సత్యసాయి



చంద్రబాబు సమక్షంలో
టిడిపిలో చేరిన కదిరి వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి నియోజకవర్గం లోని తలుపుల, గాండ్లపెంట, నంబులపూలకుంట మండలాలకు చెందిన పలువురు వైసిపి నాయకులు కదిరి నియోజ కవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి కంది కుంట వెంకటప్రసాద్ టిడిపిలో చేరారు. ఈసందర్భంగా వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో వెళ్లి మంగళగిరి లోని టిడిపి ప్రధాన కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ టిడిపి అధినేత చంద్ర బాబు నాయుడు కండువాలు వేసి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నియోజకవ ర్గంలో తెలుగుదేశం పార్టీ రావటం ఖాయమన్నారు. టీడీపీని గెలిపించి చంద్రబాబుకు కానుక ఇద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నియోజకవర్గ టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



- ◆ అంగన్‌వాడీల ఆందోళనపై ఉక్కుపాదం
- ◆ తాళాలు పగులగొట్టి అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచే యత్నం
- ◆ అడ్డుకున్న అంగన్‌వాడీలు
- ◆ చలిలోనూ కొనసాగుతున్న దీక్ష

సమ్మెపై ఉక్కు సంకెళ్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షపై ప్రభుత్వం ఉక్కు సంకెళ్లతో బంధించే ప్రయత్నం చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను హెల్త్ సెక్రటరీల ద్వారా పగులగొట్టించి బలవంతంగా తెరిపించే ప్రయత్నాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేశారు. అనంతపురం నగరంలో బిందెలవారీ కాలనీలోనూ, నార్పల మండల కేంద్రంలోనూ, విడపనకల్లు మండలంలోనూ ఇటువంటి ప్రయత్నాలు చేశారు. వీటిని అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. సత్యసాయి జిల్లాలోనూ ఇటువంటి ప్రయత్నాలు జరిగాయి. నల్లచెరువు, మడకశిర మండలాల్లో తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేశారు. ఇక్కడ అన్ని చోట్ల అంగన్‌వాడీలు అడ్డుకుని మరో తాళాలు వేసి మూసివేశారు. అదే సందర్భంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట 36 గంటల దీక్షను అంగన్‌వాడీలు చేపట్టారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట బైటాయించి అక్కడే వంటా వార్పు చేసుకుని తిన్నారు. రాత్రికి చలిలోనూ నిద్రపోయారు. వీరికి ఆశా వర్కర్లు మద్దతు తెలిపారు. అంతకు మునుపు ఉదయం అనంతపురం మాజీ శాసనసభ్యులు వి.ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌లు పాల్గొని మద్దతు తెలిపారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లోనూ టిడిపి, సిపిఎం, సిపిఐ నాయకులు అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



బత్తలపల్లిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించాలని సత్యసాయి కలెక్టర్ ఆదేశాలు

అంగన్‌వాడీ కేంద్రాలు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి వంద శాతం ప్రారంభించాలని సత్యసాయి జిల్లా కలెక్టరు అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. అధికారులతో సమీక్షలు నిర్వహించి ఐసిడిఎస్ పీడీ, ఐకెపి అధికారులకు ఈ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేయడం, అంతుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలివ్వడం పట్ల అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్

ఎన్నికలకు ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ నాయకులతోపాటు, సిఐటియు రాష్ట్ర నాయకులు జీ.ఓబుళు డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చేస్తామని ఎన్నికల ముందు హామీనిచ్చారని గుర్తు చేశారు. అదే విధంగా కొత్తగా తెచ్చిన యాప్ వలన అంగన్‌వాడీలకు సమస్య నెలకొందని చెప్పారు. రిటైర్డుబెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్లను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. అలా కాకుండా అణచివేసే ప్రయత్నం చేస్తే అంగన్‌వాడీ వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

3వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

వార్తలు 6లో

కదంతొక్కిన ఆశాలు

సమస్యల పరిష్కారం కోరుతూ ఆశావర్కర్లు పోరుబాట పట్టారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 36 గంటల నిరసన దీక్షకు దిగారు. ఈ మేరకు పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం నాడు దీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు హాజరయ్యారు. దీక్షలకు వెళ్లనీయకుండా ఆయా ప్రాంతాల్లో పోలీసులు వీరిని అడ్డుకున్నా వాటిని ఎదిరించి దీక్షల్లో ఆశలు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆశలు ముక్త కంఠంతో నినదించారు.



పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

- ◆ 36 గంటల నిరసన దీక్షలు ప్రారంభం
- ◆ మద్దతు తెలిపిన సిపిఎం, టిడిపి, జనసేన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆశల 36 గంటల నిరసన దీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ దీక్షలకు సిపిఎం, టిడిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదరిశ ఎం.ఇంతియాజ్ ఇంతియాజ్, టిడిపి నాయకుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ తదితరులు మద్దతు తెలిపారు. ఆశా వర్కర్ల జిల్లా గౌరవాధ్యక్షులు సాంబయ్య, బాబావలి, జిల్లా ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి, సౌభాగ్య దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ఆశాలు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, హామీలను నెరవేర్చాలని గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వేతనాల పెంపుకోసం ఆందోళనలు చేయాల్సిన దుస్థితిని కల్పించడం విచారకరం అన్నారు. ఆశాలకు గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలను ఆశాలకు వర్తింపజేయాలన్నారు. కోవిడ్ కాలంలో మరణించిన ఆశాల కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, ఆ కుటుంబంలో ఒకరిని ఆశాగా తీసుకోవాలన్నారు.ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాల్లో ఆశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాల న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ హక్కుల సాధన కోసం పోరాటమే మార్గం అన్నారు. సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు చేపట్టిన దీక్షలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆశాల న్యాయమైన కోర్కెలను తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలు అన్ని విధాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిత్యావసర సరుకులు ధరలు పెరగడంతో ప్రజలు జీవన స్థితిగతులు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. ఆశాలు, అంగన్వాడీలకు వేతనాలు పెంచమంటే డబ్బుల్లేవనే ముఖ్యమంత్రి తన సలహాదారులకు మాత్రం కోట్లాది రూపాయలను జీతాలు రూపంలో ఖజానా సొమ్మును పంచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, అంబులెన్స్ రమేష్, చక్రపాణి, జనసేన నాయకులు అబ్దుల్, రాము, ఆశ వర్కర్ల జిల్లా కమిటీ నాయకురాలు హనుమక్క, బషీర్, దర్శనమల పుష్పతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అడుగడుగునా అడ్డగింత

ఆశ వర్కర్లను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. 36 గంటల దీక్షల్లో పాల్గొనేందుకు పుట్టపర్తికి వస్తున్న వారిని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. పుట్టపర్తిలోకి ప్రవేశించే ప్రధాన మార్గాల్లో ప్రత్యేక పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. అందులో ప్రయాణిస్తున్న ఆశా వర్కర్లను సమావేశానికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. మహిళా పోలీసులు ఆశా వర్కర్ల ఆధార్ కార్డులు పరిశీలించి వెనుతిరిగి వెళ్లాలని సూచించారు. మరి కొంతమందిని పుట్టపర్తి రూరల్ స్టేషన్‌కు తరలించారు. మామిళ్లకుంట క్రాస్, జగరాజుపల్లి, కర్నాటక నాగేపల్లి, ప్రధాన కూడళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించి ఆశాలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో పోలీసుల తీరుపై ఆశలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.



పుట్టపర్తిలో దీక్షకు వెళ్లకుండా ఆశాలను మడకశిరలో అడ్డుకుంటున్న పోలీసులు

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

క్రమశిక్షణతో కూడిన విద్య మంచి భవిష్యత్తుకు పునాది వేస్తుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల ఉపయోగాలతో ముద్రించిన ఎస్ఎస్‌సి 2024 మోడల్ టెస్ట్ పేపర్లను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్నతో పాటు ఎంఇఒలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం 25 సంవత్సరాలు అనుభవం గల యుటిఎఫ్ ఉపాధ్యాయులతో రూపొందించిన ఈ మోడల్ పేపర్లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు వీటిని ఉపయోగించుకొని మంచి మార్కులు సాధించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ రామకృష్ణనాయక్, పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, సాయి గణేష్, యుటిఎఫ్ జిల్లా మున్సిపల్ కన్వీనర్ బిల్లే రామాంజనేయులు, స్థానిక నాయకులు నాగేంద్ర కుమార్, రాంప్రసాద్, రామాంజనేయులు, ఆదిశేషు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మోడల్ టెస్ట్ పేపర్స్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్, జయచంద్రారెడ్డి, తదితరులు

వైసిపి పెట్టిన కేసులకు బెయిల్ : చిలకం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వైసిపి నాయకులు తనపై పెట్టిన అక్రమ కేసులకు హైకోర్టు బెయిల్ ఉత్తర్వులు ఇచ్చిందని వాటి ప్రతులను వన్ టౌన్ పోలీసులకు సమర్పించానని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలపై వైసిపి ప్రభుత్వం ఎన్ని కేసులు నమోదు చేసినా చట్ట ప్రకారం తాము వాటిని ఎదుర్కొంటామని తెలిపారు. తెలుగుదేశం న్యాయవిభాగం రాష్ట్ర కోశాధికారి హైకోర్టు కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ఎంకే కాలువ అంజన్ రెడ్డి, ధర్మవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెలుగుదేశం న్యాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంపి సుబ్బారావు బెయిల్ ప్రతులను తనకు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు, రూరల్ మండల కన్వీనర్ నాగ సుధాకర్ రెడ్డి, కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు కోటికి రామాంజి, దాము, తలారి ప్రతాప్, జయరాం, నత్తి శ్రీరామ్ రెడ్డి, చిలకం సుధాకర్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు మంగళకర విద్యార్థులు

పుట్టపర్తి రూరల్: ఇంటర్ యూనివర్సిటీ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మంగళకర కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ సురేష్ కుమార్ తెలిపారు. కళాశాలలో బిబిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న బి .బాబు, బీకాం పి .జగదీష్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. జాతీయస్థాయిలో జరిగే ఈ పోటీలు తమిళనాడులోని ఎస్సార్ యూనివర్సిటీ లో ఈనెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు, ఏవో జయచంద్రారెడ్డి, పీడీ శ్రీనివాసులు, మంగళకర అధ్యాపకులు తదితరులు అభినందించారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

తిరుపతిలో ఇటీవల జరిగిన సబ్ జూనియర్ జూడో పోటీలలో చిగిచెర్ల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మైనస్ 35 వైట్ కేటగిరీలో విక్రాంత్, మైనస్ 32 వైట్ కేటగిరీలో యశ్విత, మైనస్ 40వైట్ కేటగిరీలో లాస్యా రెడ్డి, మైనస్ 52 వైట్ కేటగిరీలో యశస్విని బంగారు పతకాలు సాధించారు. దీంతో వీరు ఈ నెల 15 నుంచి కేరళలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల పీడీ ప్రతాప్ రెడ్డి, హెచ్ఎం తిమ్మారెడ్డి తెలిపారు. ప్రతిభా విద్యార్థులను ఈసందర్భంగా ఆయన అభినందించారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బత్తలపల్లి : మండలంలోని కాటమకుంట గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు బొమ్మా వెంకటరెడ్డి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం మృతుడు వెంకటరెడ్డి మతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు కమతం ఈశ్వరయ్య, గుర్రం శ్రీనివాసరెడ్డి, బయపరెడ్డి, సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

పుట్టపర్తి అర్బన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారమే విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. ఈనెల 22, 23 తేదీలలో భారత ఎన్నికల సంఘం కమిషనర్ విజయవాడలో అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాబోయే సార్వత్రిక ఎన్నికలపై ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారులు మున్సిపల్ కమిషనర్లు తహశీల్దార్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఒకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 20వ తేదీ లోపు అన్ని క్లెయిమ్స్ పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి 27 యాప్‌లు ఉన్నాయని తెలిపారు. . త్వరలో జిల్లాలో ఎన్నికల కమిషన్ బృందం పర్యటించనుందన్నారు.

ఇన్‌ఛార్జుల మార్పే వైసిపి పతనానికి సంకేతం : టిడిపి


ప్రజాశక్తి - రొద్దం

వైసీపీలో జరుగుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జుల మార్పే వైసిపి పతనానికి సంకేతమని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి హరికృష్ణ విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే ఇన్‌ఛార్జుల మార్పు చేస్తున్నారని విమర్శించారు.

బాధితులకు కౌన్సిలర్ ఆర్థికసాయం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని రాంనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు చింత రమణదాస్ కుమారుడు ధర్మతేజ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న 39 వ వార్డు కౌన్సిలర్ కడప రంగస్వామి, అతనిసోదరుడు కడప ఈశ్వర్ రంగా వార్డులో ప్రతి ఇంటింటికి వెళ్లి ధర్మతేజ చికిత్స కోసం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆదేశాల మేరకు కౌన్సిలర్ రంగస్వామి తన వంతుగా పదివేల రూపాయలు జమ చేశాడు. మొత్తం 60 వేల రూపాయలను బాధితులకు అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న కౌన్సిలర్, తదితరులు

పాదయాత్రకు సంఘీభావం

ముదిగుబ్బ : త్వరలో జరిగే ఎన్నికల్లో వైసిపి 175 స్థానాల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ బసవరావు అనే వ్యక్తి ఇడుపులపాయ నుండి ఇచ్చాపురం వరకు పాదయాత్ర చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన పాదయాత్ర గురువారం ముదిగుబ్బ మండలానికి చేరుకుంది. దీంతో స్థానిక వైసిపి నాయకులు ఆయన పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఇన్‌ఛార్జి ఇందుకూరు నారాయణరెడ్డి, సర్పంచి లక్ష్మీదేవి చంద్రాయుడు, ఉప సర్పంచి లోకేశ్వర్ రెడ్డి, వైసీపీ నాయకులు కిరణ్, శ్రావణ్ ఎల్ఐసి రామంజి, చిల్లా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్లామిక్ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజిఎం మైదానంలో జామియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇస్లామిక్ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌కు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అదే విధంగా ఎంజిఎం మైదానంలో మైనార్టీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇస్లామిక్ సదస్సుకు అవసరమైన అన్ని సౌకర్యాలను వైసిపి నాయకులు వేణురెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మేన్ జబివుల్లా, ఎ బ్లాక్ కన్వీనర్ సిపిసి సాదిక్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. ఈసదస్సుకు పట్టణంతో పాటు చుట్టు పక్కల నుంచి వేలాది మంది ముస్లిం సోదరులు హాజరయ్యారు. ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన మౌలానా ఆలిమా రబ్బని జుల్ఫికార్ ఉల్మ సజ్జద్ నోమని నక్షబందియా, బెంగళూరుకు చెందిన జామియా ఇస్లామియ మౌలానా సోహాబ్‌వుల్లాలు పాల్గొన్నారు.

'గోనుగుంట్ల' హయాంలోనే ధర్మవరం అభివృద్ధి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజక వర్గ అభివృద్ధి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ హయాంలోనే జరిగిందనిగోనుగుంట్ల అనుచరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిష్ రాజు, చిగిచెర్ల అరవింద్ రెడ్డి, తుంపర్తి పరమేష్, బోడగల గిరిధర్ మాట్లాడుతూ గోనుగుంట్ల సూర్యనారాయణ మారుమూల గ్రామానికి కూడా తారురోడ్డు వేయించారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన గోనుగుంట్లను స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నబీరసూల్, దుస్సాక్రిష్ణ, దస్తగిరి, నారాయణస్వామి యాదవ్, రాప్తాటి రాము, ఏలుకుంట్ల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి సంస్థ సీడ్ యాప్ సంయుక్తంగా ఉచిత మేనేజ్మెంట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ ఆ పైన చదివిన వారు ఈ కోర్సులను నేర్చుకోవడానికి అర్హులు అని చెప్పారు. ఆసక్తి కలిగిన యువతి యువకులు తమ ఆధార్ జిరాక్స్ కాపీ తో పాటు మొబైల్ నెంబరుతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 4 నెలలు శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి కలవారు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ విజయభారతి సెల్ నెంబర్, 7981541994కు సంప్రదించాలని చెప్పారు.

విద్యపై దృష్టి సారించండి

ప్రజాశక్తి ఇ- బత్తలపల్లి

భవిష్యత్తుకు పునాది విద్యార్థి దశేనని విద్యార్థి దశలో విద్య పైనే దృష్టి సారించాలని ఎస్ఐ పి. శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయంలో డ్రగ్స్, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. ప్రతి విద్యార్థిని దిశ యాప్ ను తమ సెల్ ఫోన్ లో డౌన్లోడ్ చేసుకోవాలని ఆపద సమయంలో దిశ యాప్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సమావేశంలో కెజిబివి ప్రిన్సిపల్ గుల్జార్ బేగం, ఉపాధ్యాయులు, కానిస్టేబుల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి నాయకులు అన్నారు. మండలంలోని సంకేపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సివి. నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ భాస్కర్, సర్పంచి ప్రసన్న గోపాల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయమంటే బెదిరింపులా..?

అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు పగులగొట్టడం దుర్మార్గం

మొండి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

3వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

'ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నాం. తమ డిమాండ్లు న్యాయమైనవి. చాలా సార్లు విజ్ఞాపనలు ఇచ్చి పరిష్కరించకపోవడంతో విసిగివేసారి సమ్మెలోకి దిగాం. ఇలాంటి పరిస్థితుల్లో సమస్యలపై చర్చలు జరిపి పరిష్కరించాల్సింది పోయి ప్రభుత్వం అధికారుల చేత బెదిరింపులకు పాల్పడడం సరికాదు. బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తాళాలను పగలగొట్టాలని చూడడం దుర్మార్గమైన చర్య. ఇలాంటి మొండి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'... అని అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 3వ రోజుకు చేరుకుంది. అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసన దీక్షలు కొనసాగాయి. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడాన్ని అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు ఖండించారు.



రొద్దంలో తాళం పగులకొడుతున్న దృశ్యం



కదిరిలో మోకాళ్లపై నిరసన



పెనుకొండలో అంగన్వాడీలకు బెదిరిస్తున్న పోలీసులు



ముదిగుబ్బలో మోకాళ్లపై నిరసన



హిందూపురంలో మానవహారం ఏర్పాటు చేసిన అంగన్వాడీలు, నాయకులు

ప్రజాశక్తి - రొద్దం

అంగన్వాడీల ఆందోళనకు భగ్నం చేయడానికి అధికారులు యత్నించారు. పలు అంగన్వాడీ కేంద్రాలకు వేసిన తాళాలను పగులకొట్టారు. స్థానిక తహశీల్దార్ అనంతచారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ, సుజాతమ్మ, తదితరులు కలసి రొద్దం ఒకటో అంగన్వాడీ కేంద్రం తాళాలు పగలకొట్టి వెలుగు సిబ్బందికి అప్పగించారు.

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్ల తాళాలను అధికారులు పోలీసుల సమక్షంలో పగలగొట్టారు. ఈ సందర్భంగా అంగనవాడి యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ సాయంత్రం సమయాల్లో భవనాల తాళాలను పగలగొట్టడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ సందర్భంగా వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

సోమందేపల్లి : మండల పరిధిలోని పలు అంగన్వాడి సెంటర్ల తాళాలను అధికారులు పగులకొట్టడం అప్రజాస్వామిక చర్య అని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు పెద్దన్న విమర్శించారు. అంగన్వాడి కార్మికులు ప్రజాస్వామికంగా తన హక్కులకై పోరాటం చేస్తుంటే ప్రభుత్వం నియంతృత్వ ధోరణిలో ప్రవర్తించడం అన్యాయమన్నారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సెంటర్ లపై దాడి చేసి తాళాలు పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్ఐ విజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

గుడిబండ : అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి మూడవరోజు చేరుకుంది. అమరాపురం, గుడిబండ మండలాలకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు గురువారం సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. వీరిని ప్రభుత్వం అధికారుల ద్వారా బెదిరిస్తూ మండలంలోని పలు అంగన్వాడి సెంటర్లలో తాళాలు విరగొట్టి అంగన్వాడి కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేశారు. తమకు ఉన్నతాధికారి నుంచి ఆదేశాలు ఉన్నాయనిఅంగన్వాడి సెంటర్లు తెరువకపోతే తమకు సెంటర్ల తాళాలు ఇవ్వాలని అధికారులు అంగన్వాడీలను బెదిరించారు. తమ సిబ్బంది ద్వారా అంగన్వాడి సెంటర్ తాళాలు విరగొట్టి వాలంటీర్ల ద్వారా విధులు నిర్వహిస్తామని అంగన్వాడీ కార్యకర్తలను గుడిబండ ఎంపీడీవో రామారావు హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని శంకరగల్లు, రాళ్లపల్లి, దాసరపల్లి, కరికెర,మద్దనకుంట, మోరుబాగల్ గ్రామాల్లోనీ అంగన్వాడీ సెంటర్ల తాళాలను సచివాలయ సిబ్బంది విరగగొట్టి వాలంటీర్ల ద్వారా విధులు నిర్వహిస్తామని అంగన్వాడీ కార్యకర్తలను బెదిరించినట్లు అంగన్వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. ఈ సందర్భంగా అమరాపురం గుడిబండ మండలాలకు చెందిన అంగన్వాడి యూనియన్ ప్రతినిధులు మహదేవమ్మ ,నాగమణి, అనసూయ, లక్ష్మీదేవి, మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఇలా వ్యవహరించడం అమానుషమన్నారు. తమను అరెస్టు చేసినా సరే తాళాలు ఇవ్వమని మొండికేశారు. ఈ కార్యక్రమంలో అమరాపురం గుడిబండ మండలాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు.

తలుపుల : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరుకుంది. గురువారం నిర్వహించిన ఈ సమ్మెలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంబంధిత అధికారులు సమ్మెను విరమింప చేయాలని అంగన్వాడీలపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెనే విరమించుకోమని ఘాటుగా స్పందించారు. దశలవారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

అగళి : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. వీరి ఆందోళనకు సిపిఎం జిల్లా నాయకులు రామాంజనేయులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పరిధిలోని 33 అంగన్వాడీ సెంటర్ల వర్కర్లు. హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : మండల కేంద్రంలో సిడిపిఒకార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి మద్దతు ఇచ్చి సంఘీభావం తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు మనోహర్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు భక్తర్, మండల కన్వీనర్లు దాసిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి : అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరుకుంది ఈ నిరసన కార్యక్రమానికి టిడిపి మండల కన్వీనర్ యాతం పోతులయ్య మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బత్తల కదిరప్ప, సికేపల్లి సెక్టర్ అంగన్వాడీ అసోసియేషన్ లీడర్ లక్ష్మీదేవి, రమాదేవి, అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమ్మె నిర్వహించారు. ఉదయం 4 గంటలకే అంగన్వాడీలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడంతో సిఐటియు నాయకులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులకు సిఐటియు నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.అరెస్ట్ చేసిన అంగన్వాడీలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, తిప్పన్న , నాయకులు శ్రీరాములు, మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్, వెంకటరాముడు, నారాయణ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు బావమ్మ, జయమ్మ, సావిత్రమ్మ, వరలక్ష్మి, పార్వతమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : సిఐటియు ఆధ్వర్యంలో అంగనవాడీలు సమ్మెకు దిగారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఓబులదేవర చెరువు : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మూడవరోజు గురువారం అంగన్వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మండల కార్యదర్శి శ్రీ రాములు ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్లో మానవహారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు కుల్లాయప్ప, నాయకులు సున్నంపల్లి వెంకటరమణ, యూనియన్ నాయకురాలు మణిమాల, రంగమ్మ, ఆశీర్వాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు సమ్మె చేపట్టారు. గురువారం ఉదయం నిరసన దీక్షలలో పాల్గొనడానికి బయలుదేరినకార్యకర్తలను పోలీసులు పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ అణిచివేతతో పోరాటాలను ఆపలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం రమేష్, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు సరస్వతి, పద్మావతి, కార్యకర్తలు భారతి, లక్ష్మీదేవి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల మద్దతు : అంగన్వాడీల ఆందోళకు టిడిపి స్థానిక నాయకులు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాబూ సాబ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు అంజనప్ప, నాగభూషణ నాయుడు, దేవళం వేణు, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు సమ్మెలో పాల్గొనారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు వి.వి. రమణ, సిపిఎం నాయకులు శివన్న, సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు ఒంటెద్దు వేమన్న మాట్లాడుతూ అణిచివేతతో పోరాటాలను ఆపలేరని మరింత ఉధృతంగా నిరసన దీక్షలను చేపట్టి తమ న్యాయమైన సమస్యలను సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకురాలు భాగ్యమ్మ, పద్మావతి, కార్యకర్తలు మంజుల,భారతి, లక్ష్మీదేవి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలో చేపట్టిన అంగన్వాడీల ఆందోళనకు అఖిలపక్ష నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, కాంగ్రెస్, సిపిఐ రైతు సంఘం నాయకులతో పాటు సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, నాయకులు బాబు, వెంకటేష్ ,పోతలయ్య, లక్ష్మీనారాయణ, రహంతుల్లా, చాంద్ బాషా, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు రజియా తదితరులు పాల్గొన్నారు

చిలమత్తూరు : అంగన్ వాడీలు తమ న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మెచేస్తుంటే నోటీసులు అక్రమ అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ కార్యాలయం ముందు మూడవ రోజు సమ్మె కొనసాగింది.

కదిరి టౌన్ : తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా 3వ రోజు కదిరి పట్టణ మునిసిపల్ ఆఫీసు నందు అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొని మోకాళ్ళ పై నిలబడి వినూత్న రీతిలో సమ్మె కొనసాగించారు . ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జీ.ఎల్. నరసింహులు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవటం దుర్మార్గమన్నారు. అంగన్వాడీల సమ్మెకు గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు కదిరి పట్టణ నాయకులు బాబ్జాన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు మూడోరోజు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న అంగన్వాడీలు మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు శ్రామిక మహిళ దిల్షాద్ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోరికలను తీర్చమంటూ రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు వాసంతి, ప్రధాన కార్యదర్శి రజియా, ప్రాజెక్టు లీడర్లు వసంత, పుష్పలత, శివమ్మ, సుగుణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అంగన్వాడీల ఆందోళనకు టిడిపి నాయకులు మద్దతుగా తెలిపారు. ఇదిలా ఉండగా మైదుగోళం అంగన్వాడీ కేంద్రం తాళాలను గ్రామ రెవిన్యూ అధికారి పగులకొట్టారు. ఈ ఘటనపై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ధనమ్మ, రూప, భాగ్యమ్మ, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడానికి చేతకాక...ఉద్యమాన్ని అణచి వేయాలని ప్రయత్నం చేసిన ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని అంగన్వాడీలు అన్నారు. సమ్మెలో భాగంగా మూడవరోజు గురువారం అంగన్వాడీలతో పాటు సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణంలో కళ్లకు నల్ల రిబ్బను కట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడి నిరసన తెలిపి, అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందించారు. వీరి ఆందోళనకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రావెల్ల లక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, బిఎస్‌పి రాష్ట్ర నాయకులు శ్రీరాములు, ఎస్‌సి, ఎస్టీ, బిసి, మైనార్టీ హక్కుల సంఘం రాష్ట్ర నాయకురాలు పార్వతమ్మతో పాటు ఇతర ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడానికి చేతకాని ప్రభుత్వం ఉద్యోగులను, సచివాలయ సిబ్బందిని అడ్డం పెట్టుకుని మూసి ఉన్న కేంద్రాలను తెరపించడంపై అంగన్వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తు దీక్షా శిబిరం నుంచి వన్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, నాయకులు శిరీషాతో పాటు పెద్ద ఎత్తున అంగన్ వాడీలు పాల్గొన్నారు.



రొళ్ల మండలంలో తాళం పగులకొడుతున్న అధికారులు



ఎన్పీకుంటలో మోకాళ్లపై నిరసన



సోమందేపల్లిలో అంగన్వాడీలను బెదిరిస్తున్న పోలీసులు



లేపాక్షిలో మోకాళ్లపై నిరసన

గుండెపోటుతో పిఇటి మృతి

నల్లమాడ : మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పిఇటి గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన భయ్యారెడ్డి (50) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందినట్లు మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

8 నుంచి డైట్ పరీక్షలు

కొత్తచెరువు : జనవరి 8వ తేదీ నుండి డైట్ విద్యార్థులకు సెమిస్టర్ టూ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో మీనాక్షి తెలిపారు. సెమిస్టర్ టు విద్యార్థులతో పాటు 2020 - 23, మరియు 2021 - 23 బ్యాచ్ లకు చెందిన విద్యార్థులకు కొత్త చెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లను ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

ఓబులదేవరచెరువు : ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ లాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పని ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక కొండకమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థిని, విద్యార్థులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ లపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ కిషోర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న టిటిసి విద్యార్థులకు పరీక్షలు

కొత్తచెరువు : విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప జిల్లాల్లో ఏర్పాటు చేసిన డైట్ పరీక్ష కేంద్రాలలో టిటిసి రెగ్యులర్, ఒకసారి ఫెయిల్ అయిన వారిని ఈనెల 17వ తేదీ నుండి లోయర్ గ్రేడ్ త్రీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు అభ్యర్థుల వెరిఫికేషన్ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ఐడెంటి కార్డును సమర్పించాలని చెప్పారు.

గడువులోగా అభివృద్ధి లక్ష్యాలు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో చేపట్టిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. స్థిరమైన లక్ష్యాలు, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై గురువారం విజయవాడలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు పాఠశాల విద్య, నాడు నేడు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు. గ్రామ సచివాలయాల భవనాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వివిధ దశలలో కొనసాగుతున్నాయన్నారు. ప్రతివారం సంబంధిత అధికారులతో చర్చిస్తూ తగిన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. సకాలంలో వాటిని పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు వివిధ దశలలో కొనసాగుతున్నాయని వాటిని కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పంచాయతీరాజ్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రషీద్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్, డిఎంహెచ్ఒ ఎస్‌వి. కృష్ణారెడ్డి, సిపిఒ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ అన్నం మాకొద్దు...

తినలేక భోజనం పడేసిన విద్యార్థులు

ప్రజాశక్తి మడకశిర రూరల్

మండలంలోని మనూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం చేసిన మధ్యాహ్న భోజనాన్ని తినడానికి విద్యార్థులు నిరాకరించారు.ఉడకని భోజనం మాకొద్దని .. రాగి జావాలో పురుగులు ఉన్నాయని, కుళ్లిన కూరగాయలతో అన్నం వండి పెట్టారని విద్యార్థులు వాపోయారు. అంతేకాకుండా అన్నంలో కోడి గుడ్డు తుప్పలు, చిన్న చిన్న ఇనుప కడ్డీలు దొరుకుతున్నాయని అన్నారు. ఇలాంటి భోజనం తినలేక బయట పడవేస్తున్నామని విద్యార్థులు తెలిపారు. ఇలాంటి భోజనం పెడితే పిల్లల ఆరోగ్య పరిస్థితి ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భోజనం ఎలా వున్నా ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వారు కోరుతున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : బికె

ప్రజాశక్తి -పెనుకొండ

ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె. పార్థసారథి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వరుస పంట నష్టాలతో రైతులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. పలు కారణాల వల్ల పంటలు నష్టపోయిన వారికి పంటలబీమా, న్పుట్ సబ్సిడీ సక్రమంగా అందడం లేదని తెలిపారు.గత ఖరీఫ్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో వేరుశనగ రైతులు పంటలు నష్టపోయారన్నారు. చాలా మంది పేర్లు పరిహారం జాబితాలో లేవని, ఉన్నా బీమా కింద ఎకరానికి నాలుగువేల లోపే సాయం రావడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యాన పంటల రైతులకు మొండి చెయ్యి చూపారని తెలిపారు. టమోటా రైతుకిస్తున్న పరిహారం ఒక్కరోజు కూలీ డబ్బులకన్నా తక్కువ ఉందన్నారు. ఇలాంటి అరకొర సహాయాలు బాధిత రైతులకు ఏమాత్రం ఊరట నివ్వవని అన్నారు. ఈ ఏడాది పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైసిపిది దౌర్జన్య పాలన : టిడిపి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

సుపరిపాలన కావాలా.. విధ్వంసం కావాలా అన్నది ఓటర్లే నిర్ణయించుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కత్తే కొట్టాల, మోటుమర్ల, నిమ్మలకుంట గ్రామాలలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళుతూ టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. సంక్షేమంతో పాటు సమగ్ర అభివృద్ధి ఒక్క టిడిపి తోనే సాధ్యమవుతుందని అన్నారు. వైసిపి పాలనలో అన్యాయాలు, అక్రమాలు, దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నాయకులు మహేష్ చౌదరి, పోతుకుంట లక్ష్మన్న, వేకల రామాంజనేయులు, మద్దిలేటి, నిమ్మలకుంట కుళ్లాయప్ప, కాటమయ్య, తలారి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భార్య గొంతు కోసి పారిపోయిన భర్త

పుట్టపర్తి రూరల్: భార్యపై అనుమానంతో తరచూ గొడవ పడుతూ చివరకు పుట్టింటికి వదిలి వస్తానని పిలుచుకొని వెళ్తూ మార్గమధ్యంలో భార్య గొంతు కోసి భర్త పరారైన సంఘటన గురువారం పుట్టపర్తి మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈఘటనకు సంబంధించి పుట్టపర్తి రూరల్ పోలీసులు, ప్రయాణికులు తెలిపిన వివరాలు... గోరంట్ల మండలం కొలింపల్లికి చెందిన ఆంజనేయులుకు నల్లమాడ మండలం కురుమాల గ్రామానికి చెందిన అనితతో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అయితే ఆంజనేయులు తరచూ తన భార్యను అనుమానంతో వేధిస్తూ ఉండేవాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. అయితే 20 రోజుల క్రితం భర్తకు ప్రమాదం జరగడంతో కొలింపల్లికి వచ్చింది. ఈ నేపథ్యంలో భార్య పుట్టినిల్లు అయిన కురుమాలకు వెళ్లి వద్దామని అనితను నమ్మించాడు. గురువారం భార్య అనితను ద్విచక్ర వాహనంలో తీసుకు వెళుతూ మార్గమధ్యంలో గంగిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో హత్యాయత్నం చేశాడు. తన వద్ద ఉన్న ఆయుధంతో భార్య అనిత గొంతు కోస్తుండగా అటుగా వెళుతున్న ప్రయాణికుల ఆ దృశ్యాన్ని చూసి అడ్డగించారు. ఆంజనేయులు వారిపై సైతం దాడికి ప్రయత్నించినట్టు సమాచారం. ఈసందర్భంగా అటు వెళ్తున్న వారు ఆంజనేయులపై తిరగబడ్డారు. దీంతో ఆంజనేయులు అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడి ఉన్న అనిత విషయాన్ని ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. అనితను గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వేజన ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.



చికిత్స పొందుతున్న అనిత

టైర్ల పరిశ్రమలో అగ్ని ప్రమాదం...

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలోని అమ్మాజీ ట్రేడర్స్‌కు చెందిన టైర్ల పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ పరిశ్రమలో పాత టైర్లను కాల్చి అందులో నుంచి వచ్చే పౌడర్‌ను ఎగుమతి చేస్తుంటారు. పరిశ్రమలో అయిల్ స్టోరేజ్, టైర్లు పెట్టడానికి పెద్ద గోయ్యి ఉంది. అందులో నుంచి గురువారం ఒక్క సారిగా మంటలు ఎగసి పడ్డాయి. అప్రమత్తమైన కార్మికులు మంటలను ఆర్పడానికి ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన వెంటనే చుట్టుపక్కన ఉన్నా పరిశ్రమల సిబ్బంది, కార్మికులు నీళ్ల ట్యాంకర్ ను తెప్పించి ఆ నీటితో మంటలను అదుపు చేయడానికి యత్నించారు. పక్కన ఉన్న పరిశ్రమ నుంచి అగ్నిమాపక యంత్రాల ద్వారా మంటలను అదపులోకి తీసుకువచ్చారు. అయితే అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో కార్మికులు తప్ప యాజమాన్యం, సిబ్బంది ఎవరు లేరు. పక్కన ఉన్న పరిశ్రమల వారు అప్రమత్త కాకుండా ఉంటే పారిశ్రామిక వాడలో పెను ప్రమాదం సంభవించేది.